


ఎన్టీఆర్‌స్టేడియంలో సదర్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అనిల్‌కుమార్ యాదవ్, అరవింద్ కుమార్ యాదవ్

27న ఎన్టీఆర్ స్టేడియంలో సదర్ సమ్మేళనం

● రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్

కవాడిగూడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగ సందర్భంగా ఈనెల 27న ఎన్టీఆర్ స్టేడియంలో సదర్ సమ్మేళనం (గోపూజ) ఘనంగా నిర్వహిస్తున్నట్లు రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్‌కుమార్ యాదవ్ తెలిపారు. సోమవారం ఎన్టీఆర్ స్టేడియంలో మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన సదర్ సమ్మేళనం, దీపావళికి ముందుగానే సదర్ వేడుకల ఏర్పాట్లను ఎంపీ అనిల్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నేతలు ఏర్పాట్లను పరిశీలించారు. ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ, ఉత్సవాలలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క, ఉత్తర్‌ప్రదేశ్ మాజీ సీఎం అఖిలేష్‌యాదవ్, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొంటారని ఆయన తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తా



ఇన్‌స్పెక్టర్ రాజునాయక్

చిక్కడపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేస్తామని స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్ బి.రాజు నాయక్ తెలిపారు. 2009 బ్యాచ్‌కు చెందిన రాజునాయక్ నాంపల్లి ఎస్‌హెచ్‌వో, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన ఆయన చిక్కడపల్లి ఎస్‌హెచ్‌వోగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

గురుకుల విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచడం అభినందనీయం

● మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య

రాంనగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల హాస్టల్‌లో చదివిన విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. మెస్ చార్జీలు పెంచేందుకు కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో 8 లక్షల 50 వేలమంది విద్యార్థులకు ఈ మెస్ చార్జీల పెంపు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. బీసీ హాస్టల్స్, గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించేందుకు నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.

జీవో 317 రిపోర్ట్‌పై ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం జేఏసీ హర్షం

చిక్కడపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జీవో 317పై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్‌కమిటీ రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన మంత్రులు డి.శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ చర్చించి సబ్‌కమిటీ నివేదికను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేయడంపై జీవో 317 బాధిత ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం జేఏసీ హర్షం ప్రకటిస్తూ కృతజ్ఞతలు తెలిపింది.

హుస్సేన్‌సాగర్ నాలాలో మృతదేహం స్వాధీనం

బర్కత్‌పుర, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): హుస్సేన్‌సాగర్ నాలాలో గుర్తు తెలియని మృతదేహం కొట్టుకువచ్చింది. కాచిగూడ పీఎస్ ఎస్ఐ జి.సురేష్ వివరాల ప్రకారం.. హుస్సేన్‌సాగర్ నాలాలో 45 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని మృతదేహం కొట్టుకురాగా రత్నానగర్ వద్ద స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుని చాతిపై బుజ్జి అనే పచ్చబొట్టు ఉంది. మృతుడిని గుర్తించే వారు 8712660540 నెంబర్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప వివరాల ప్రకారం.. ఉందానగర్ రైల్వే స్టేషన్ సమీపంలో 38 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్ట్

● నాలుగు బైక్‌ల స్వాధీనం

బర్కత్‌పుర, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జల్సాల కోసం ద్విచక్రవాహనాలను దొంగిలిస్తున్న ఓ దొంగను కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేసి, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కాచిగూడ పీఎస్ సీఐ కె.చంద్రకుమార్, ఎస్ఐ జి.సురేష్ వివరాల ప్రకారం.. మీర్‌పేట జిల్లెల్‌గూడలోని వీరప్పకాలనీలో ఉంటున్న చింత వేణు (32) వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్నాడు. అతన్ని పట్టుకుని విచారించగా చేసిన దొంగతనం ఒప్పుకున్నాడు. సుల్తాన్‌బజార్, అంబర్‌పేట, జీడిమెట్ల, కాచిగూడ పీఎస్‌ల పరిధిలో ఒక్కొక్క ద్విచక్రవాహనాన్ని దొంగిలించాడు. ఈ నాలుగు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అధ్వానంగా ఉదయ్‌నగర్, పవిత్రనగర్

● ఉదయ్‌నగర్, పవిత్రనగర్ కాలనీలలో అస్తవ్యస్తంగా రోడ్లు



ఉదయ్‌నగర్‌లో గుంతలమయమైన రోడ్డును చూపిస్తున్న కాలనీ వాసులు



పవిత్రనగర్‌లో రోడ్డును ఆక్రమించి నిర్మించిన షాపును చూపిస్తున్న కాలనీ వాసులు

రాంనగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని ఉదయ్‌నగర్, పవిత్రనగర్ కాలనీలలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. దీంతో ఈ రెండు ప్రాంతాల కాలనీవాసులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా పక్కపక్కనే ఉన్న ఈ రెండు కాలనీలలో రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారి రాకపోకలకు వీలు లేకుండా మారాయి. ఫీట్ లోతు గుంతల్లో వాహనదారులు, పాదచారులు అదుపుతప్పి పడిపోయి ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో ఈ కాలనీలలో నూతన రోడ్ల నిర్మాణానికి రూ. 60 లక్షల నిధులు మంజూరు చేసి తర్వాత టెండర్లను రద్దు చేశారు. అప్పటి నుంచి ఈ రోడ్ల సమస్య సంవత్సర కాలంగా కొనసాగుతూనే ఉంది. ఈ రెండు కాలనీల మధ్య గల పవిత్రనగర్ ఆలయం యాజమాన్యం ఈ రెండు కాలనీలకు వెళ్లే దారిని కొంత వరకు ఆక్రమించి షెట్టర్లు నిర్మించడంతో రోడ్డు ఇరుకుగామారి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో రాత్రి వేళ అసాంఘిక శక్తులు తిష్టవేసి కాలనీవాసులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని స్థానికులు వాపోయారు. ఈ ఆక్రమణలను తొలగించి రోడ్డు పెద్దగా చేయాలని, కాలనీల గుండా భారీ వాహనాలు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. చేపల మార్కెట్ మూలంగా ఆదివారం వాహనాలన్నీ తమ కాలనీల మీదుగా వెళ్లి ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

52 ఏళ్ల మహిళకు అరుదైన హైపెక్ సర్జరీ

● దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ ఆస్పత్రి ఘనత





అరుదైన సర్జరీ చేసిన వైద్యులు, బాధితురాలు లలిత

రాంనగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని విద్యానగర్‌లో గల దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ సెంటర్‌లో 52 సంవత్సరాల మహిళకు అరుదైన హైపెక్ సర్జరీని విజయవంతంగా నిర్వహించారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ సెంటర్ మెడికల్ డైరెక్టర్, సీనియర్ సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ ఆజాద్ చంద్రశేఖర్, సీఈవో రవీంద్రనాథ్ వెల్లడించారు. ఖమ్మం జిల్లా ముదిగొండ గ్రామానికి చెందిన నాయిని లలిత (52) నాలుగు నెలలుగా కడుపు ఉబ్బరం, ఆయాసం, ఆకలి కాకపోవడం, బరువు తగ్గడం వంటి సమస్యలతో బాధపడుతున్నారు. తగిన చికిత్స కోసం లలిత కుటుంబ సభ్యులు వైద్యులను సంప్రదించగా ఆమెకు సూడోమైక్సోమా పెరిటోని అనే అరుదైన వ్యాధి సోకింది. తప్పనిసరిగ్గా శస్త్రచికిత్స చేయాల్సి ఉండగా ఆ కుటుంబ సభ్యులు లలితను తమ ఆస్పత్రిలో చేర్పించారు. దీనిని తమ వైద్య బృందం ఛాలెంజ్‌గా తీసుకుని లలితకు పెరిటోనెక్టమి, కోలిసిస్టెక్టమీ, గ్యాస్ట్రెక్టమీ, స్ప్లెంక్టెరోటోమీ, జెజునల్ రెసెక్షన్, టోటల్ కోలెక్టమీ, గ్యాస్ట్రోజెజునోస్టోమి, ఇలియోరెక్టల్ అనస్టోమోసిస్ ఇంకా హైపర్‌థెర్మిక్ ఇంట్రాపెరిటోనియల్ కిమోథెరపీ సర్జరీలను చేయాల్సి వచ్చిందని తెలిపారు. శస్త్ర చికిత్సలకు 10 నుంచి 12 గంటల సమయం పట్టిందని, అతి తక్కువ ఖర్చుతో ఈ సర్జరీ చేశామన్నారు. సర్జరీలో వైద్యులు డాక్టర్ సమంత్, డాక్టర్ రవికుమార్ రెడ్డి, డాక్టర్ ఉల్లాస్, డాక్టర్ రాకేష్‌కుమార్ పాల్గొన్నారు. వారం రోజుల్లోనే లలితను డిశ్చార్జీ చేస్తామని ఆయన తెలిపారు.

బీజేపీ సభ్యత్వ నమోదును రెట్టింపు చేయాలి

● ఆలిండియా ఎస్సీ మోర్చా జాతీయ అధ్యక్షులు లాల్‌సింగ్



కవాడిగూడ రోటరీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన లాల్‌సింగ్ హర్యా, కార్పొరేటర్ జి.రచనశ్రీ

కవాడిగూడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను కార్యకర్తలకు వివరించి బీజేపీ పార్టీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని బీజేపీ ఆలిండియా ఎస్సీ మోర్చాజాతీయ అధ్యక్షులు లాల్‌సింగ్ హర్యా పిలుపునిచ్చారు. కవాడిగూడ డివిజన్‌లోని రోటరీ కాలనీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రత్యేక అతిథిగా హాజరై రోటరీ కాలనీలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ సమక్షంలో స్థానిక మహిళతో ఆయన మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, ప్రధాన కార్యదర్శి క్రాంతి కిరణ్, జాతీయ ఎస్సీ మోర్చా సభ్యులు వేముల అశోక్, బీజేపీ రాష్ట్ర నాయకులు జి వెంకటేష్, మీసాల విఠల్ రావు, కవాడిగూడ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఎంసీ మహేందర్‌బాబు, ఎ ప్రభాకర్ గంగపుత్ర, కేశవరాజు, బీజేపీ నేతలు రమేష్‌బాబు, కుమార్ గౌడ్, దిలీప్‌యాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆజాద్‌నగర్‌లో సభ్యత్వ నమోదు

అంబర్‌పేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : అంబర్‌పేట డివిజన్‌లో బీజేపీ నేతలు ఇంటింటికి తిరుగుతూ సభ్యత్వ నమోదు చేయించారు. బీజేపీ అధ్యక్షుడు దాసోజు నాగభూషణం చారి ఆధ్వర్యంలో ఆజాద్‌నగర్‌లో ఇంటింటా తిరుగుతూ పార్టీచేసిన అభివృద్ధి ఏంటో తెలియజెప్పారు.

సీఎం సహాయ నిధిని వినియోగించుకోవాలి : ఎమ్మెల్యే ముఠా గోపాల్



సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

రాంనగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయ నిధిని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. రాంనగర్ డివిజన్‌కు చెందిన 11 మందికి మంజూరైన రూ. 3.98 లక్షల చెక్కులను సోమవారం రాంనగర్‌లో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రాంనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు టి.శంకర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, ముదిగొండ మురళి, ఇంద్రసేనారెడ్డి, జ్ఞానేశ్వర్‌గౌడ్, గోక నవీన్, బల్వీర్‌కుమార్, కల్యాణ్‌నాయక్, గుండు వెంకటేష్, నీల దేవి, తులసీ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో లైటింగ్ సమస్యను పరిష్కరిస్తాం

● సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్

రాంనగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో యుద్ధప్రాతిపదికన లైటింగ్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్ హామీ ఇచ్చారు. లైటింగ్, వర్షం పడ్డప్పుడు స్వీపింగ్, ఇతర నిర్వహణ సమస్యలను పరిష్కరించాలని సన్‌రైజర్స్ షటిల్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే ముఠా గోపాల్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి ఈ సమస్యను బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ నేతృత్వంలో సోమవారం జోనల్ కమిషనర్ వద్దకు పంపించి సమస్యల వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు బొల్లం శ్రీనివాస్, సి.హెచ్.వీరారెడ్డి, నాగరాజు, రాజు, ఎం.ఎన్.చారి, బీఆర్ఎస్ నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెత్త రిక్షాల పార్కింగ్ సమస్యను పరిష్కరించాలి

● కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్



జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్

ముషీరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ బాపూజీ నగర్ ప్రధాన రోడ్డులో గల శ్మశాన వాటిక వద్ద చెత్త రిక్షాలను పార్కింగ్ చేయడం వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్ అన్నారు. చెత్త రిక్షాల పార్కింగ్‌వల్ల ట్రాఫిక్ సమస్య, పారిశుధ్య సమస్య ఏర్పడుతున్నాయని జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషన్ రవికిరణ్ కు సోమవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. చెత్త రిక్షాల పార్కింగ్ వల్ల రోడ్డు ప్రమాదాలే కాకుండా తీవ్ర దుర్గంధం ఏర్పడుతున్నదని అన్నారు. వాహనాలను తొలగించాలని వాహనదారులకు సూచిస్తే వారు గొడవలకు దిగుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యపై పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. స్పందించిన జోనల్ కమిషనర్.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు.

జర్నలిస్టులపై దాడులను అరికట్టాలి

చిక్కడపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను, అక్రమ కేసుల బనాయింపును వెంటనే అరికట్టాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు రాష్ట్ర అదనపు డీజీపీ మహేష్‌భగవత్‌ను కోరారు. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ప్రధానకార్యదర్శి బి. బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, పిల్లి రామ్‌చందర్, విజయ్‌కుమార్, రఘు, కార్యదర్శులు రాజశేఖర్, నవీన్, సలీమా, భిక్షపతి, నేషనల్ కౌన్సిల్ సభ్యులు రమాదేవి తదితరులు ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో తమ యూనియన్ నేషన్ కౌన్సిల్ సభ్యులు జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడైన మహ్మద్ యూసుఫ్‌పై చందుర్తి పోలీసులు అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేశారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించి పోలీసులపై చర్యలు తీసుకోవాలని, కేసును ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులలో మొన్న రాత్రి జర్నలిస్టు సుదర్శన్‌పై దుండగులు దాడి చేసి విచక్షణారహితంగా కొట్టారని అన్నారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని వారు ఆయనను కోరారు.

ఎరుకలకోసం ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



సమావేశంలో ఎరుకల సంఘం నేతలు

చిక్కడపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆదివాసి ఎరుకల సమగ్ర అభివృద్ధికోసం ఏకలవ్య కార్పొరేషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోనికి రాజు డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రూ.500 కోట్ల బడ్జెట్ కేటాయించాలని కోరారు. రాష్ట్రంలో ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేసి ఆదివాసి ఎరుకల సామాజికవర్గానికి ఎస్టీ చైర్మన్‌గా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం చిక్కడపల్లిలోని ఓ హోటల్ లో తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్రకమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సంఘం ప్రధానకార్యదర్శి కుతాడి రవికుమార్, కోనేటి నరసింహ, వనం రమేష్, శ్రీరామ్‌ఆనంద్, నాగులు, ప్రభాకర్, కుతాడి సురేష్, కూరాకుల శ్రీనివాస్, పాతపల్లి నరసింహ, సత్యనారాయణ, శ్రీరాములు, యాదగిరి, సాయి, మొగులయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

ధర్మసమాజ్ పార్టీ కవాడిగూడ డివిజన్ కార్యవర్గం ఎన్నిక

కవాడిగూడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ధర్మసమాజ్ పార్టీ కవాడిగూడ డివిజన్ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కవాడిగూడ డివిజన్ ధర్మసమాజ్ పార్టీ కన్వీనర్‌గా నిమ్మల మనోజ్‌కుమార్, కో కన్వీనర్లుగా గట్ల శ్రీధర్, శేఖపురం శ్రావణ్, కోశాధికారిగా గున్నాల సాయికుమార్ కమిటి సభ్యులు కె మురళీ కృష్ణ తదితరులను ఎన్నుకున్నట్లు కవాడిగూడ ధర్మసమాజ్ పార్టీ ఇన్‌చార్జి జి సంతోష్ మహారాజ్ తెలిపారు.

రుణమాఫీ, రైతు భరోసా అమలు చేయాలి : రైతుసంఘం

చిక్కడపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రెండులక్షల లోపు రుణమాఫీ, రైతుభరోసా, తదితర హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించి ఇచ్చిన హామీ లు నెరవేరకపోవడంతో రైతాంగం ఆందోళన చెందుతోందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ ఆరోపించారు. సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం సోమవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో మూడ్ శోభన్ అధ్యక్షతన జరిగింది. రుణమాఫీ చేసి పంటల బోనస్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నంద్యాల నర్సింహారెడ్డి, ప్రొ.అరిబండి ప్రసాదరావు, మాదినేని రమేష్, వెంకటేశ్వర్లు, లెల్లెల బాలకృష్ణ, ప్రమీల, బాల్‌రాజ్‌గౌడ్, గఫూర్ పాష, సత్తిరెడ్డి, శ్రీనివాస్, వెంకటేష్ పాల్గొన్నారు.

తెలుగు పద్యనాటకాలను పరిరక్షించుకోవాలి



నటులను సన్మానిస్తున్న రవాణాశాఖ పూర్వ కమిషనర్ సీఎల్ఎన్ గాంధీ, దైవజ్ఞశర్మ తదితరులు

చిక్కడపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలుగు పద్యనాటకాలను పరిరక్షించుకోవాలని రవాణాశాఖ పూర్వ కమిషనర్ సీఎల్ఎన్ గాంధీ అన్నారు. ఆరాధన సంస్థ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో సోమవారం రాత్రి దుర్యోధనుని మయసభ, శయన దృశ్యం పద్యనాటక ప్రదర్శన ఆకట్టుకునేలా సాగింది. సాల్వాచారి ఈ సందర్భంగా కృష్ణ పాత్రను సమర్థవంతంగా పోషించారు. దుర్యోధనునిగా ఎన్టీరామారావు, అర్జుననిగా భాగిశాస్త్రి నటన పద్యాలాపనతో నాటకాన్ని రక్తికట్టించారు. సామాజిక కార్యకర్త హనుమంతరావు అధ్యక్షత వహించిన సభలో యువకళావాహిని అధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ, సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ, కళాభిమానులు భాస్కర్ రావు, సాంబశివరావు పాల్గొనగా సంస్థ అధ్యక్షుడు లోకం కృష్ణయ్య స్వాగతం పలికారు.

అంబర్‌పేటకు నిధులు ఇవ్వండి : ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



జీహెచ్‌ఎంసీ నూతన కమిషనర్ ఇలంబరిదిని కలిసిన ఎమ్మెల్యే

అంబర్‌పేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కె.ఇలంబరిదిని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సోమవారం కార్యాలయంలో కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై వినతి పత్రం అందజేసి సమస్యల పరిష్కారానికై నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే విన్నపంపై కమిషనర్ సానుకూలంగా స్పందించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

గోల్నాక, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : గోల్నాక తులసీనగర్‌కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం పదిమంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ చెక్కులను అందజేశారు. రూ.3లక్షల 47వేల విలువైన చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబర్‌పేట నియోజకవర్గంలోని పేదలకు ప్రభుత్వ పరంగా అందే వివిధ సంక్షేమ పథకాలు, ఆర్థిక సహాయం అందేలా తన కృషి ఎల్లవేళలా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కలుషితనీటి సమస్యను పరిష్కరించండి : కార్పొరేటర్ పావని



జీఎం రామకృష్ణకు సమస్య వివరిస్తున్న కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

చిక్కడపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ చిక్కడపల్లి బాపునగర్, పరిసర ప్రాంతాల్లో చాలా కాలంగా మంచినీటిలో కలుషిత నీటి సరఫరా, లోప్రెషర్ సమస్య ఉందని శాశ్వతప్రాతిపదికన వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని డివిజన్ వాటర్‌వర్క్స్ డివిజన్ 5 జీఎం రామకృష్ణను డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం జీఎం రామకృష్ణను ఆయన కార్యాలయంలో కలిసి సమీక్షించారు. ఈ సమస్యను పలుమార్లు తెలియజేసినా అధికారులు పట్టించుకోవడంలేదని ఆమె జీఎంకు తెలిపారు. సమస్య పరిష్కారం కానట్లయితే డివిజన్ ప్రజలతో కలిసి జీఎం కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమీక్షలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, వాటర్‌వర్క్స్ డీజీఎం కార్తీకరెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

పేదల ఇళ్లను కూల్చివేస్తే బీజేపీ ఊరుకోదు

● బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న గౌతమ్‌రావు

బర్కత్‌పుర, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మూసీ ప్రక్షాళన పేరుతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పేద ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నదని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు ఆరోపించారు. పేదల ఇళ్లను కూల్చివేస్తే బీజేపీ చూస్తూ ఊరుకోదని ఆయన హెచ్చరించారు. సోమవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూసీ బాధితులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, బీజేపీ అండగా ఉంటుందన్నారు. ఈ నెల 22న గోల్నాక డివిజన్ పరిధిలోని తులసీరాంనగర్ లంక నుంచి మూసీ నదిని పర్యవేక్షించి బాధితులను కలుస్తున్నామని తెలిపారు. ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే రామారావు పాటిల్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డిలు మూసీ బాధితులను కలిసి పరామర్శిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి సి.కృష్ణాయాదవ్, నియోజకవర్గం కన్వీనర్ శ్యామ్‌రాజ్, కార్పొరేటర్ వై.అమృత, సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్, సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఏడెల్లి అజయ్‌కుమార్, రవీందర్‌గౌడ్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేయాలి

బైరి వెంకటేశం డిమాండ్



ఇందిరాపార్కువద్ద మాట్లాడుతున్న బైరి వెంకటేశం, చిత్రంలో గాలి వినోద్‌కుమార్

కవాడిగూడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ జాబితాలోని మోస్ట్ బ్యాక్‌వర్డ్ ఎస్సీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఎస్సీ 57 ఎంబీఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు బైరి వెంకటేశం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద మోస్ట్ బ్యాక్ వర్డ్ ఎస్సీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన దీక్ష చేపట్టారు. దీక్షలో పాల్గొన్న బైరి వెంకటేశం మాట్లాడుతూ, ఎస్సీ ఉపకులాల న్యాయమైన డిమాండ్లపై నవంబర్ 1 వరకు ప్రభుత్వం స్పందించకపోతే 9న రాష్ట్ర వ్యాప్తంగా ఎంఆర్ఓ కార్యాలయాల ముట్టడి, 24న ఎమ్మెల్యేల కార్యాలయాలు, డిసెంబర్ 14న అసెంబ్లీని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ నిరసన దీక్షకు ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ హాజరై మద్దతు ప్రకటించారు. నిరసన దీక్షలో రాష్ట్ర అధ్యక్షులు నీరగొండ బుచ్చన్న, ప్రధాన కార్యదర్శి టీఎస్ స్వామి, మహిళా కన్వీనర్ టి శోభాబాయి, యూత్ కో కన్వీనర్ రాజ్‌కుమార్, ఏపీ గౌరవ అధ్యక్షుడు డి సత్యం, ఏపీ అధ్యక్షులు ఘంట రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి సుంకన్న, ఉపాధ్యక్షులు శివయ్య తోపాటు ఎస్సీ ఉపకులాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి



బాగ్‌లింగంపల్లిలో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవిచారి, డీజీఎం

రాంనగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : బాగ్‌లింగంపల్లి జలమండలి సెక్షన్ పరిధిలో డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి డిమాండ్ చేశారు. జలమండలి చేపట్టిన 90 రోజుల డ్రైనేజీ శుద్ధి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా సోమవారం బాగ్‌లింగంపల్లి జలమండలి సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాలలో కార్పొరేటర్ కె.రవిచారి, జలమండలి డీజీఎం మోహన్‌రావు, మేనేజర్ జ్యోతి తదితరులు పర్యటించి డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. ఎయిర్‌టెక్ మిషన్ల ద్వారా డ్రైనేజీ తొలగింపు చర్యలను వేగవంతం చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, అధికారులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్

● జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిథల్



ఇందిరానగర్‌లో డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న జలమండలి మయాంక్ మిథల్

ముషీరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్‌లో డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి 90 రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిథల్ అన్నారు. సోమవారం భోలక్‌పూర్ డివిజన్‌లోని ఇందిరానగర్‌లో జలమండలి అధికారులతో కలిసి మయాంక్ మిథల్ పర్యటించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ.. మ్యాన్‌హోల్స్ నుంచి ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగిస్తూ డ్రైనేజీ మురుగునీరు సాఫీగా పోయేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నగర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌ను పరిశీలిస్తూ రోడ్లపై డ్రైనేజీ మురుగు ప్రవాహం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి తెలిపారు. ఆయన వెంట జలమండలి డైరెక్టర్ విజయ్‌కుమార్, సీజీఎం ప్రభూ, జీఎం రామకృష్ణ, డీజీఎం కార్తికరెడ్డి తదితరులు పాల్గొన్నారు.